అదును చూసి.. ధరలు పెంచి

- కోతకు వచ్చిన సోయా పంట
- ధరలు పెంచిన హార్వేస్టర్ యజమానులు
- రైతులపై మరింత ఆర్థికభారం


సోయా పంట కోస్తున్న హార్వేస్టర్

తాంసి: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన సోయా పంట ప్రస్తుతం కోతకు వచ్చింది. సోయా కోసేందుకు రైతులకు ఖర్చులు మరింత పెరుగుతున్నాయి. పంట కోసేందుకు సరిపడా కూలీలు లేక రైతులు హార్వేస్టర్ యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న హార్వేస్టర్ నిర్వాహకులు పంట కోతలకు అద్దె రేట్లను గతేడాది కంటే ఎక్కువగా పెంచారు. గతేడాది ఎకరానికి రూ.2వేల వరకు ఉంటే, ఈఏడాది ఎకరానికి రూ.3 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. పంట వర్షాలకు దెబ్బతినకుండా కోతలు కోసి కాపాడుకోవాలని రైతులు ఆరాటపడుతున్నారు.

హార్వేస్టర్‌పైనే ఆధారం..

సోయా కోతలకు రైతులు హార్వేస్టర్ యంత్రాలను వినియోగిస్తారు. ఇదే అదునుగా భావిస్తున్న హార్వేస్టర్ యజమానులు రైతుల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు అధిక ధరలను నిర్ణయిస్తున్నారు. సోయా చేతికొచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో భూమి తడిగా ఉంది. కోత సమయంలో హార్వేస్టర్‌లు భూమిలో కురుకుపోయే అవకాశంతో ఉండడంతో కోత సైతం సరిగా రావడం లేదు. భూమి తడిగా ఉండడంతో ఎకరానికి రూ.3వేల నుంచి రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. అద్దెలు పెరగడంతో ఆర్థిక భారం పడుతుందని రైతులు వాపోతున్నారు. ఎకరానికి ప్రస్తుతం 4 నుంచి 5 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుందో లేదోనని దిగులు చెందుతున్నారు.

పంట దెబ్బతింది



పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో సోయా దెబ్బతింది. పంటలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వ ఉండడంతో సోయా నల్లగా మారింది. పెద్ద హార్వేస్టర్ ద్వారా సోయా కోత చేద్దామంటే వీలు కావడం లేదు. చిన్న చైన్ హార్వేస్టర్ చేద్దామంటే అధిక ధర చెబుతున్నారు. – వెంకట్ రెడ్డి, రైతు, తాంసి

హార్వేస్టర్ల అద్దె పెరిగింది



హార్వేస్టర్‌ల అద్దె ధర పెరగడంతో రైతులకు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రతీ ఏడాది కోతల సమయంలో ధరలు పెంచుతున్నారు. పంట దిగుబడి రాక రైతులు ఇబ్బంది పడుతుంటే హార్వేస్టర్‌ల ధరలు పెంచుతూ పోతున్నారు. కూలీల కొరతతో ధర పెంచుతున్నారు. – ఆందే అనంద్, రైతు, పొన్నారి

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ఇంద్రవెల్లి: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఇంద్రవెల్లి అటవీశాఖ అధికారి సంతోష్ అన్నారు. సోమవారం అటవీశాఖ 71వ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణపై, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అడవిజంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు రాజేందర్, చంద్రారెడ్డి, సిబ్బంది విశాల్, సంజీవ్ జోంద్లే పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

ఇంద్రవెల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ నుంచి బరిలో ఉండే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులపై కార్యకర్తలతో చర్చించారు. పక్కా ప్రణాళికతో పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోటే శోభాబాయి, సాయినాథ్, మారుతి డొంగ్రె, మహ్మద్ అంజద్, సుఫీయన్, గణేష్ తహరే, మీర్జా జిలానిబేగ్, పుర్క బాపురావ్, రాథోడ్ వసంత్‌రావ్, గేడం భారత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భూక్యా జాన్సన్‌నాయక్

ఉట్నూర్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి, సత్తా చాటాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉట్నూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. విభేదాలు పక్కన పెట్టి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో విజయం సాధించేలా ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. నాయకులు చారులత రాథోడ్, భరత్ చౌహాన్, జైవంత్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరికొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఖానాపూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని చిమ్మన్‌గూడి గ్రామంలో మాట్లాడారు. పలువురు బీఆర్ఎస్‌లో చేరగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పెంటన్న, సునీల్, రాజారాం, చందు, బియ్యాల మల్లేష్, బాలాజీ, రంజాన్, గోవర్ధన్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న రితేశ్ రాథోడ్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండల శాఖ ఆధ్వర్యంలో లక్కారం పరిధిలోని కేబీనగర్‌లో బీజేపీ చేరికల కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ పాల్గొని పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కష్టపడి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బింగి వెంకటేశ్, కొండేరి రమేశ్, సిపతి లింగాగౌడ్, కాల్వ రవి, రాజశేఖర్ జాదవ్ రవి, గంగాధర్ పాల్గొన్నారు.

గెలుపు కోసం కృషి చేయాలి

భీంపూర్: బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, న్యాయవాది కేమ శ్రీకాంత్ అన్నారు. సోమవారం భీంపూర్ మండలంలోని గిరిజన మారుమూల ప్రాంతమైన గొల్లగడ్‌లో పర్యటించారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు గంగాధర్, జనార్దన్, వినోద్ పాల్గొన్నారు.

కలప పట్టివేత


పట్టుకున్న కలపతో అధికారులు

సిరికొండ: మండల కేంద్రంలో సోమవారం అటవీశాఖ అధికారులు తనిఖీల్లో ఎండీ శౌకత్, సద్దాం ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్లు ఉట్నూర్ ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర, ఎఫ్ఎస్ఓ చంద్రారెడ్డి, సత్యయ్యలు తెలిపారు. పట్టుకున్న కలప సుమారుగా రూ.18 వేల వరకు ఉంటుందన్నారు. పట్టుకున్న కలపపై విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎఫ్‌బీవో సంతోష్, భీంజీ, నాయక్, హీరాలాల్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్ చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: సెల్‌ఫోన్ చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ధన్గర్ ఆకాష్‌కు చెందిన ఫోన్‌ను దొంగలించేందుకు యత్నించిన తాటిగూడకు చెందిన షేక్ ముస్తఫాను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించడం జరిగిందని వివరించారు.

10న చెట్ల తొలగింపునకు బహిరంగ వేలం

కైలాస్‌నగర్: పట్టణంలోని గాంధీ పార్క్‌లో గల ఉసిరి బ్లాక్‌లో పెరిగిన సుబాబుల్, గుల్‌మోర్ చెట్ల తొలగింపునకు ఈనెల 10న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు పార్క్ ఆవరణలో నిర్వహించే వేలంలో ఆసక్తి గల వారు రూ.లక్ష ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. వివరాలకు 8977713928 , 9440765485 ,9849913061 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బయోమెట్రిక్ ఆధార్ సేవలు ఉచితం

ఐదు నుంచి 17 ఏళ్లలోపు బాలలకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలను ఏడాది పాటు ఉచితంగా అందించనున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. 17 ఏళ్ల దాటిన వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం రూ.125 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఆగని వర్షం

సిరికొండ: రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది వర్షం. ఈ ఏడాది విస్తరంగా కురుస్తున్న వర్షాలకు చేతికి వస్తున్న పంటలు దెబ్బతింటున్నాయి. సోమవారం మండలంలో భారీ వర్షం కురవడంతో చిక్‌మాన్ వాగు పొంగిపోర్లింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు.


పొంగిపోర్లుతున్న చిక్‌మాన్ వాగు

నిండా మునిగిన రైతులు

ఇచ్చోడ: రెండు నెలల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు నిండా మునిగారు. మండలంలోని మాన్కగూడ గ్రామానికి చెందిన రాంసాయి ఈఏడాది రెండు ఎకరాల్లో సోయా పంట సాగు చేశాడు. ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు సోయాకు కాత, పూత లేదు. ఎకరానికి రెండు క్వింటాళ్ల దిగుబడి రావడమే కష్టంగా మారిందని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు.


దెబ్బతిన్న సోయా పంటను చూపిస్తున్న రైతు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఖానాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ అన్నారు. ఖానాపూర్‌లోని తిమ్మాపూర్ పద్మశాలి సంఘ భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీలకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఇటీవల ఎన్నికైన ఖానాపూర్ మండలానికి చెందిన ముగ్గురు జిల్లా కార్యవర్గంలో చోటుదక్కిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి, కార్యదర్శిగా మదిరె శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గద్దం రవీందర్ ఎన్నిక కాగా, వీరిని అభినందించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన రాజారెడ్డిని బీజేపీ ఆధ్వర్యంలో సన్మానించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కడెంలో మాట్లాడుతున్న రితేశ్‌రాథోడ్

కారును ఢీకొట్టిన కంటైనర్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ వద్ద సోమవారం సాయంత్రం 44వ జాతీయ రహదారిపై కంటైనర్ కారును ఢీ కొన్న సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయపడ్డారు. నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కారును కంటైనర్ లారీ వెనకు నుంచి ఢీ కొనడంతో ప్రమాదం చొటుచేసుకుంది. కారులో నలుగురు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరీపిల్చుకున్నారు.


ప్రమాదానికి గురైన కారు

అంధకారంలో ఉట్నూర్ బస్టాండ్


ప్రతీరోజు వేల మంది ప్రయాణం సాగించే ఉట్నూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో అంధకారం నెలకొంది. దీంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - ఉట్నూర్‌రూరల్

పేరుకుపోయిన పూడిక


జైనథ్: మండల కేంద్రంలోని ఐదో వార్డులో పారిశుధ్యం పడకేసింది. డ్రెయినేజీల్లో పూడిక తీయకపోవడంతో మురుగు రోడ్డుపై ప్రవహిస్తుంది. అలాగే తీవ్ర దుర్గంధం వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. పలుమార్లు గ్రామపంచాయతీ కార్యదర్శికి చెప్పినా.. పట్టించుకోవడం లేదు. వర్షాకాలం కావడంతో అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. ఇప్పటికైనా గ్రామపంచాయతీ సిబ్బంది స్పందించి డ్రెయినేజీల్లో పూడిక తీయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

'హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం'

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం జైనథ్ మండల బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన అంశాలపై చర్చించారు. మోసపూరిత హామీలు ఇచ్చి కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టాయన్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్ సంవత్సరానికి 25 వేల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని మండిపడ్డారు. మళ్లీ తెరపైకి సీసీఐని తీసుకువచ్చి దాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్క్రాప్ కింద అమ్మేసేందుకు యత్నిస్తున్నాయన్నారు. సమావేశంలో నాయకులు యాసం నర్సింగ్ రావు, గోవర్ధన, అడప తిరుపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జోగు రామన్న

కలెక్టర్ సుడిగాలి పర్యటన


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజర్షి షా సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. తొలుత భగత్‌సింగ్‌నగర్‌లో నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయ భవనాన్ని పరిశీలించారు. పనుల నాణ్యతను పరిశీలించేందుకు పబ్లిక్ హెల్త్ ఈఈ, మున్సిపల్ కమిషనర్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ, కేవీకే ప్రిన్సిపాల్‌తో కూడిన కమిటీని నియమించారు. అనంతరం రూ.12.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న హరిఓం నగర్ బ్రిడ్జి ప్రాంతాన్ని, తాత్కాలిక వంతెనను పరిశీలించారు. పనులు త్వరితగతిన చేపట్టి నాణ్యతతో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి తిర్పెల్లి రామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అబ్దుల్లా చౌక్‌ను సందర్శించి కాలనీలో తాగునీటి సమస్యకు గల కారణాలపై ఆరా తీశారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వాల్మీకినగర్‌లో టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులను పరిశీలించారు. గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈ పేరిరాజు, పబ్లిక్ హెల్త్ ఈఈ గంగాధర్, ట్రాన్స్‌కో ఎస్ఈ జేఆర్ చౌహన్ , ఆర్అండ్‌బీ డీఈ రమేశ్ తదితరులున్నారు.

విపత్తు ప్రభావిత ప్రాంతంగా గుర్తించాలి

కైలాస్‌నగర్: రైతులు పంటలు పూర్తిగా నష్టపోయినందున జిల్లాను విపత్తు ప్రభావిత ప్రాంతంగా గుర్తించాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షాను క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. తక్షణం వారిని ఆదుకునే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిహారం చెల్లించేలా కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కలెక్టర్, ఎస్పీలకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లను ఎఫ్ఆర్‌వోల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం వారిని వేర్వేరుగా కలిసి శాలువాతో సత్కరించారు. అటవీ, పోలీసు అధికారులపై దాడి చేసిన నిందితులపై పీడీయాక్ట్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో ఎఫ్ఆర్‌వోలు గులాబ్‌సింగ్, గణేష్, సంతోష్, పుండలిక్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.


కలెక్టర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

క్లుప్తంగా

నేడు కాంగ్రెస్ సమావేశం

కైలాస్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సాత్నాల, 12 గంటలకు ఆదిలాబాద్ రూరల్, మధ్యాహ్నం 1గంటకు మావల మండల నాయకులతో సమావేశం నిర్వహించడం జరగుతుందన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి నాయకులు హాజరు కావాలని కోరారు.

నేడు దాబా(కె)లో ధర్మచక్ర పరివర్తన్ దివస్

ఇచ్చోడ: మండలంలో దాబా(కె)లో మంగళవారం అంబేడ్కర్ భవన్ వద్ద ధర్మచక్ర పరివర్తన్ దివస్ నిర్వహించనున్నట్లు సంఘం నాయకుడు గణేష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ధమ్మ గురువు సత్యపాల్ మహరాజ్ రానున్నట్లు పేర్కొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ పునఃప్రారంభం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో స్విమ్మింగ్‌పూల్ మంగళవారం నుంచి పునఃప్రారంభించనున్నట్లు నిర్వాహకులు రాష్ట్రపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో తాత్కాలికంగా మూసినట్లు పేర్కొన్నారు. నిర్వహణ పనులు పూర్తయిన నేపథ్యంలో తిరిగి ప్రారంభించడం జరుగుతుందన్నారు.

మెడికల్ షాపులకు నోటీసులు


తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆవరణలోని రెండు మెడికల్ షాపులకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత నోటీసులు జారీ చేశారు. సోమవారం మెడికల్ షాపులను తనిఖీ చేశారు. ఒక మెడికల్ షాపులో ఫార్మసిస్టు లేకపోవడం, రిజిస్టర్లు సరిగా లేకపోవడాన్ని గుర్తించారు. అలాగే మరో షాపును సైతం తనిఖీ చేపట్టారు. అక్కడ కూడా పలు లోపాలు ఉండడంతో నోటీసులు అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేసి, నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు.

నిత్యం యోగాతో ఒత్తిడి దూరం


యోగా ఆసనాలు చేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: నిత్యం యోగాతో ఒత్తిడి దూరమవుతుందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంద అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆదిలాబాద్ కింగ్స్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పించారు. విద్యార్థులు శారీరకంగా, మానసింగా దృఢంగా ఉండేందుకు ప్రతినిత్యం యోగా చేయాలన్నారు. మారుతున్న జీవన విధానంతో విద్యార్థులు అనేక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. యోగా గురువు చిన్నయ్య, ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ ప్రకాష్, భగవాన్ దుర్గా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

తలమడుగు: మండలంలోని సుంకిడి రైతువేదికలో స్థానిక సంస్థల ఎన్నికలపై అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మాస్టర్ ట్రెయినర్ ప్రతాప్, మహేంద్ర ఎన్నికల్లో పాటించే నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. జరగబోయే ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లను ఎలా ఉపయోగించాలని వివరించారు. విధులలో నిర్లక్ష్యం చేయవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంపీడీవో, సిబ్బంది పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల బరిలో సీపీఎం'

ఉట్నూర్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల బరిలో సీపీఎం ఉంటుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూసం సచిన్ అన్నారు. సోమవారం ఉట్నూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజల అండతోనే పోటీలో ఉంటామన్నారు. కార్యక్రమం నాయకులు బొజ్జ ఆశన్న, ఉయిక విష్ణు, మడవి నాగోరావ్, సునీల్ పాల్గొన్నారు.